## ఎస్సీ వర్గీకరణను తక్షణమే రద్దు చేయాలి

● మాలమహానాడు అధ్యక్షుడు డాక్టర్ వీఎల్ రాజు

కవాడిగూడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఎస్సీ వర్గీకరణను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 14వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని నిరసన ప్రదర్శనలు చేపట్టాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్ రాజు , జాతీయ కమిటీ గౌరవ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ పిలుపునిచ్చారు. గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఎస్సీ జాబితాలోని 57 కులాలకు రిజర్వేషన్ అవకాశాలు లేకుండా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ చేస్తోందని వారు ఆరోపించారు. మాలలకు జరిగిన అన్యాయంపై, కోల్పోయిన రిజర్వేషన్ హక్కులను కాపాడుకునేందుకు ఈనెల 14న ఉదయం 11 గంటలకు లోయర్‌ట్యాంక్ బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన, నిరసన ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు సంఘాలు, మాల అడ్వకేట్లు, మహిళా విభాగం నాయకులు, వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న దళిత బహుజన పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.



సరోజినీ నాయుడు జీవనసాఫల్య పురస్కార గ్రహీతలతో అతిథులు

## స్వాతంత్ర్యయోధుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యయోధుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలని యువతకు వక్తలు సూచించారు. గురువారం రాత్రి త్యాగరాయగాన సభలో సరోజినీనాయుడు జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ జర్నలిస్టు, రచయిత ఉడయవర్లు, ప్రముఖ సాహితీవేత్త చిమ్మపూడి శ్రీరామమూర్తిలకు సరోజినీ నాయుడు జీవనసాఫల్య పురస్కారాలు బహూకరించారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి, తెలుగు యూనివర్సిటీ వీసీ ఆచార్య వెలుదండ నిత్యానందరావు మాట్లాడుతూ, అవకాశాలు వస్తే మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభాపాటవాలు ప్రదర్శిస్తారన్నారు. వారి వారి రంగాల్లో నిష్ణాతులైన ఇద్దరు ప్రముఖులను సత్కరించడం అభినందనీయమన్నారు కార్యక్రమంలో డా. ఓలేటి పార్వతీశం, ఓరుగంటి భాగ్యలక్ష్మి, శ్రీలక్ష్మీ, కృష్ణవేణి, లలితాపరమేశ్వరి, నిర్వాహకులు భారతి కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభావంతులను ప్రోత్సహించాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ కలవారిని ప్రోత్సహించాలని ట్రేడ్ యూనియన్ ప్రముఖ నాయకుడు డా. కాచం సత్యనారాయణ గుప్తా అన్నారు. సయ్యద్ మ్యూజికల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం త్యాగరాయగానసభలో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్‌ను సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై సత్యనారాయణ గుప్తా మాట్లాడుతూ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వివిధ రంగాల్లో రాణిస్తున్న వారి ప్రతిభను ప్రదర్శింపచేసి వండర్‌బుక్ రికార్డ్స్‌లో వారి పేర్లు నమోదు చేయించి ప్రోత్సహిస్తున్న నరేందర్‌గౌడ్ అభినందనీయుడన్నారు. ఈ సందర్భంగా పలువురు గాయనీ గాయకులు ఎంపిక చేసిన సినీగీతాలు మధురంగా ఆలపించారు. కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకుడు అరికపూడి రఘు పాల్గొన్నారు.



పఠాన్ బస్తీలో షర్బత్ పంపిణీ చేస్తున్న ముస్లింలు

## భక్తి శ్రద్ధలతో 'షబ్ - ఏ బరాత్'

ముషీరాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు షబ్-ఏ-బరాత్ పండుగను గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదుల్లో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు.పండుగ సందర్భంగా ముషీరాబాద్ పఠాన్‌బస్తీ లో అన్నదానంతో పాటు షర్బత్ పంపిణీ చేశారు. .

## వాలంటైన్స్ డేను నిషేధించాలి: భజరంగ్ సేన

బర్కత్‌పుర, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వాలంటైన్స్ డే (ఫిబ్రవరి 14)ను రాష్ట్ర ప్రభుత్వం నిషేధించాలని భజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్ లక్ష్మణ్‌రావు డిమాండ్ చేశారు. పాశ్చాత్య విష సంస్కృతికి మూలమైన ఈ ప్రేమికుల దినోత్సవం వల్ల యువత, విద్యార్థులు పెడదోవపడుతున్నారన్నారు. గురువారం కాచిగూడలోని భజరంగ్ సేన రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వాలంటైన్ డే రోజున రాత్రి 11 గంటల వరకు పార్కులు, పబ్‌లు, హోటల్స్‌ను పూర్తిగా మూసివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్‌తోపాటు సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనర్లను కలిసి ఈ విషయంపై విన్నవించామన్నారు. ప్రేమికులు రోడ్లపై కనిపిస్తే వారి తల్లిదండ్రులను పిలిచి బహిరంగంగా వివాహాలు చేయిస్తామని లక్ష్మణ్‌రావు హెచ్చరించారు. సమావేశంలో భజరంగ్ సేన నేతలు మనోజ్, రామేశ్వర్ మిశ్రా, వాణిప్రియ, అశిష్‌సింగ్, పీయూష్ ఆశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధప్రాతిపదికన రోడ్డు పనులు పూర్తి చేయాలి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి):కాచిగూడ డివిజన్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి కోరారు. గురువారం జీహెచ్ఎంసీ ఏఈ ప్రశాంత్‌తో కలిసి డివిజన్‌లోని లింగంపల్లి కర్ణాటక సాహిత్య మందిర్ వద్ద రూ. 20 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆమె పరిశీలించారు. బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు బల్వీర్, కృష్ణకుమార్, క్షీరసాగర్; అరవింద్, అజారిబాబు, భీమ్‌రాజ్, సంతోష్, రామకృష్ణ, రవియాదవ్, సూరి పాల్గొన్నారు.




ధర్నా చేస్తున్న ఐప్సో నాయకులు

## అమెరికా తీరును నిరసిస్తూ 'ఐప్సో' ధర్నా

కవాడిగూడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో ఉంటున్న విదేశీయుల పట్ల ట్రంప్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అవమానకరంగా ఉందని, అమెరికా తన పద్ధతిని మార్చుకోవాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ (ఐప్సో ) డిమాండ్ చేసింది. అమెరికాలో అక్రమంగా ఉండటంతో పాటు పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేస్తున్నారని విదేశీయుల కాళ్లు, చేతులకు ఇనుప సంకెళ్లు వేసి సైనిక విమానంలో బలవంతంగా వారిని స్వదేశాలకు పంపించడాన్ని నిరసిస్తూ గురువారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఐప్సో ఆధ్వర్యంలో నిరసన, ధర్నా నిర్వహించారు. అమెరికా తన తీరును మార్చుకొని మానవ హక్కులకు భంగం కలగకుండా వ్యవహరించడంతో పాటు అంతర్జాతీయ న్యాయసూత్రాలను పాటించాలని వారు డిమాండ్ చేశారు. ధర్నాలో ఏపీపీఎస్ జాతీయనేత ఎంఎల్ పీస్ అవార్డు గ్రహీత కె. యాదవరెడ్డి, ఐప్సో జాతీయ అధ్యక్ష వర్గ సభ్యులు, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్, ఐప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవీఎల్ ప్రధాన కార్యదర్శి జి నాగేశ్వర్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ పాల్గొన్నారు., కార్యక్రమంలో ఐప్సో రాష్ట్ర నాయకులు ఉమామహేష్, జేకే శ్రీనివాస్, రవికిరణ్, హసన్, నరేంద్ర ప్రసాద్, రజాక్, హర్షద్ పాల్గొన్నారు.

# నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- పదవ తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాసులు
- రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక బోధన
- విద్యార్థులకు సాయంత్రం వేళల్లో స్నాక్స్ పంపిణీ



ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులు

ముషీరాబాద్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తుండటంతో ముషీరాబాద్ విద్యామండలి పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంగా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టారు. మండల పరిధిలోని 7 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న 337 మంది విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించి స్పెషల్ క్లాసులు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 9గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5గంటల వరకు ప్రత్యేక తరగతులు తీసుకుంటూ విద్యార్థులకు వచ్చే సందేహాలను నివృత్తి చేయడంతోపాటు ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక నజర్ పెడుతున్నారు. గతేడాది కంటే ఈ విద్యా సంవత్సరంలో మరింత ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు. డిసెంబర్‌లో 10వ తరగతి విద్యార్థులకు సెలబస్ పూర్తి కావడంతో ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులచే రివిజన్ చేయిస్తున్నారు.

### విద్యార్థులు అలసిపోకుండా స్నాక్స్ పంపిణీ

విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలోనే ఉండి చదువుకుంటుండటంతో వారు అలసిపోకుండా ప్రభుత్వం ప్రతి రోజూ విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేస్తోంది. దీంతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు, దాతలు విద్యార్థులకు వివిధ రకాల స్నాక్స్‌ను అందజేస్తున్నారు.

### సిలబస్ పూర్తయింది



ముషీరాబాద్ విద్యామండలి పరిధిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో పని చేస్తున్నాం. విద్యార్థులకు పాఠాలు సులువుగా అర్థమయ్యేలా ఉపాధ్యాయులతో బోధన చేయిస్తున్నాం. వారి అనుమానాలను నివృత్తి చేస్తున్నాం. ఇప్పటికే సిలబస్ పూర్తయింది. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులకు స్పెషల్ క్లాసులు తీసుకుంటున్నాం.

- శ్రావణ్ కుమార్, ముషీరాబాద్ డిప్యూటీ డీఈఓ

### నమూనా పరీక్షలు నిర్వహిస్తున్నాం



విద్యార్థుల్లో పరీక్షల భయం తొలగించేందుకు నమూనా పరీక్షలు నిర్వహిస్తున్నాం. రోజుకొక సబ్జెక్ట్ చొప్పున చదివించడంతోపాటు చదువులో వెనుకబడ్డ విద్యార్థులను గుర్తించి వారు తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించేలా విద్యాబోధన చేస్తున్నాం.

- స్వరూపారాణి, ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం

## ఆంజనేయస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.2.37 లక్షలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయ హుండీని గురువారం లెక్కించారు. 50 రోజుల హుండీ ఆదాయం మొత్తం రూ. 2 లక్షల 37వేల 606 లు వచ్చింది. గురువారం ఆలయ ఆవరణలోని సీతారామ కల్యాణ మండపంలో ఆలయ సిబ్బంది,భక్తులు హుండీని లెక్కించారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ, ఆలయ పునర్ నిర్మాణ కమిటీ చైర్మన్ జానకీసుధాకర్, ఈఓ మాచర్ల దేవనాథం ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆల య ప్రధాన అర్చకుడు బుగ్గా లక్ష్మీపతి శర్మ, కమిటీ సభ్యుడు ఎన్.శ్యామ్ పాల్గొన్నారు.

## 'రోడ్డు సేఫ్టీ' అవగాహన ర్యాలీ

రాంనగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా సంస్థలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2, నెహ్రూ యువ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రోడ్ సేఫ్టీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ విష్ణుప్రియ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, హెల్మెట్ ధరించాలని, సిగ్నల్స్ జంప్ చేయొద్దని, రాంగ్ రూట్‌లో వెళ్లొద్దని, త్రిబుల్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు వరలక్ష్మి, స్వప్న, కుమారస్వామి, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## బాగ్‌అంబర్‌పేట సమగ్రాభివృద్ధికి కృషి

●ఎమ్మెల్యే కాలేరు



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి తదితరులు

నల్లకుంట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : బాగ్ అంబర్‌పేట డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గురువారం డివిజన్‌లోని అజీజ్‌బాగ్ మసీదు వీధిలో రూ. 22 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డివిజన్‌లో తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్ల ఆధునికీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నా మన్నారు. అలాగే పలు కాలనీలు, బస్తీలలో కొత్తగా సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు పార్కుల సుందరీకరణ పనులు పూర్తి చేశామన్నారు. ముఖ్యంగా నూతన వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి మాట్లాడుతూ, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సహకారంతో డివిజన్‌లోని ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సీహెచ్ చంద్రమోహన్, మోర శ్రీరాములు ముదిరాజ్, బాలకృష్ణ, మిరియాల శ్రీనివాస్, జీహెచ్ఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న నరేష్‌గౌడ్

## నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోండి

అంబర్‌పేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వచ్చే వేసవి కాలంలో అంబర్‌పేట డివిజన్‌లో మంచినీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని అంబర్‌పేట డివిజన్ బీజేపీ అధ్యక్షుడు నరేష్‌గౌడ్ జలమండలి మేనేజర్ ప్రదీప్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. అలాగే, తాగునీటి సరఫరాలో లోప్రెషర్ సమస్యను పరిష్కరించాలని కోరారు. తన వినతికి జలమండలి మేనేజర్ సానుకూలంగా స్పందించారని, సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని నరేష్‌గౌడ్ తెలిపారు.

## రీ సర్వే నిష్పక్షపాతంగా నిర్వహించాలి: టీడీపీ

రాంనగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : కులగణన రీ సర్వేను నిష్పక్షపాతంగా నిర్వహించాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. గురువారం పార్టీ నగర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే సక్రమంగా జరగలేదని ప్రతిపక్షాలు, బీసీ సంఘాలు ఆరోపిస్తున్న నేపథ్యంలో రీ సర్వేకు అవకాశం ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాని స్వాగతిస్తున్నామన్నారు. రీ సర్వేలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పార్టీ నగర ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పలుస బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు ఎస్.ప్రకాశ్ పాల్గొన్నారు.




క్రీడాకారులకు క్రికెట్ కిట్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీ వి.హనుమంతరావు

## క్రీడా రంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

రాంనగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో క్రీడా రంగ కాంగ్రెస్ ప్రభుత్వం అంకితభావంతో కృషి చేస్తున్నదని మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. గురువారం గాంధీభవన్‌లో వీహెచ్ క్రీడాకారులకు, జర్నలిస్టులకు క్రికెట్ కిట్‌లు పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి తగిన బడ్జెట్ కేటాయించారని అన్నారు. యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, కాంగ్రెస్ మీడియా ఇన్‌చార్జి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రికవరీ సాల్వెంట్ పరిశ్రమలపై నిషేధం ఎత్తివేయడంపై హర్షం



మంత్రి కొండా సురేఖను సన్మానిస్తున్న పాత శివకుమార్, మురళి తదితరులు

రాంనగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రికవరీ సాల్వెంట్ పరిశ్రమల ఏర్పాటుకు అనుమతిస్తూ ప్రభుత్వం సర్క్యూలర్ జారీ చేయడాన్ని స్వాగతిస్తూ తెలంగాణ ఇండస్ట్రీస్ రికవరీ సాల్వెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు పాత శివకుమార్, కార్యదర్శి మురళి తదితరులు మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని 33 రికవరీ సాల్వెంట్ పరిశ్రమలపై నిషేధం విధించిందని, దాంతో తాము ఉపాధి కోల్పోయామన్నారు. తమ సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పరిశ్రమల శాఖ కమిషనర్, ఉన్నతాధికారులకు విన్నవించగా వారు తమ సమస్యపై సానుకూలంగా స్పందించి నిషేధాన్ని ఎత్తివేస్తూ సర్క్యూలర్ జారీ చేశారని తెలిపారు. ప్రస్తుతం ఔటర్ రింగ్ రోడ్డు లోపల పటాన్‌చెరువు సమీపంలో ఉన్న తమ పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్డు అవతల నూతనంగా ఏర్పాటు చేసుకొనేందుకు 200 ఎకరాలను కేటాయించి ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి కొండా సురేఖకు విన్నవించామన్నారు. తమ వినతిపై మంత్రి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మానోతు బాలు, సభ్యులు ఎండీ లాల్ తదితరులు పాల్గొన్నారు.



గజ్జెల రుషికేశ్వర్ (ఫైల్)



రుషికేశ్వర్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎం.కోదండరెడ్డి తదితరులు

## టీపీసీసీ కార్యదర్శి గజ్జెల రుషికేశ్వర్ మృతి

● నేడు బన్సీలాల్‌పేటలో అంత్యక్రియలు

రాంనగర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : టీపీసీసీ కార్యదర్శి గజ్జెల రుషికేశ్వర్ (75) అనారోగ్యంతో గురువారం ఉదయం రాంనగర్‌లోని తన నివాసంలో మృతి చెందారు. ఆయనకు భార్య శారద, కుమారులు రుషికేశ్వర్‌రావు, అనిల్‌కుమార్ ఉన్నారు. రుషికేశ్వర్ కాంగ్రెస్ పార్టీలో నాలుగు దశాబ్దాలుగా పనిచేస్తూ పార్టీలో పలు పదవులు నిర్వహించారు. కాగా, రాష్ట్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఎం.కోదండరెడ్డి, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, టీపీసీసీ కార్యదర్శి జీఎస్ కేశవ్, మాజీ కార్పొరేటర్లు ఆర్. కల్పనాయాదవ్, వాజిద్ హుస్సేన్, కాంగ్రెస్ నాయకులు గజ్జెల సూర్యనారాయణ తదితరులు రుషికేశ్వర్ ఇంటికి వచ్చి భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. దళిత సంఘాల నేతలు గజ్జెల దయానంద్, నాగయ్య, స్వామి, సత్యంతో పాటు వివిధ పార్టీల నాయకులు నివాళులర్పించారు. రుషికేశ్వర్ అంత్యక్రియలు శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు బన్సీలాల్‌పేట శ్మశానవాటికలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న హరీశ్‌రావు, లోకిని రాజు తదితరులు

## ఎరుకల సామాజికవర్గానికి బీఆర్ఎస్ అండ

● మాజీ మంత్రి హరీశ్‌రావు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎరుకల సామాజికవర్గానికి బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని మాజీ మంత్రి, శాసనసభ్యుడు టి. హరీశ్‌రావు అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎరుకల సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎరుకల సామాజికవర్గాన్ని అన్ని విధాలుగా ఆదుకుందని ఈ సందర్భంగా హరీశ్‌రావు గుర్తుచేశారు. అనంతరం సంఘం అ ధ్యక్షులు లోకిని రాజు మాట్లాడుతూ, అసెంబ్లీ, శాసనమండలిలో ఎరుకల కులస్తుల సమస్యలపై మాట్లాడేవారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రాజకీయ పార్టీలు ఎరుకల సామాజికవర్గాన్ని గుర్తించి గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కుతాడి రవికుమార్, కోనేటి నరసింహ, వనం రమేష్, నాగులు, మొగులయ్య, రవి, నరేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## 'హిందూ సమాజ వ్యతిరేకుల ఆగడాలను అరికట్టాలి'

నల్లకుంట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : హిందూ సమాజానికి వ్యతిరేకంగా పని చేస్తున్న వీరరాఘవరెడ్డి వంటి దుర్మార్గుల ఆగడాలను వెంటనే అరికట్టాలని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం సంయుక్త కన్వీనర్ ఏడెల్లి అజయ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల దాడికి గురైన చిలుకూరి బాలజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌ను గురువారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సనాతన ధర్మాన్ని కాపాడుతూ సమాజంలో ఉన్న అంటరానితనాన్ని దూరం చేసేందుకు రంగరాజన్ కృషి చేస్తున్నారని, ఆయనపై దాడిని హిందూ సమాజమంతా ఖండించాలన్నారు. కార్యక్రమంలో బాగ్‌అంబర్‌పేట డివిజన్ బీజేవైఎం అధ్యక్షుడు ఏడెల్లి బాలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు స్థలం పరిశీలన

●'హోటల్ మారియట్ చౌరస్తా'లో పరిశీలించిన ట్రాఫిక్ పోలీసులు



స్థలాన్ని పరిశీలిస్తున్న చిక్కడపల్లి ట్రాఫిక్ సీఐ వీరేశం, కాంగ్రెస్ నాయకుడు ఆకుల ప్రవీణ్ తదితరులు

కవాడిగూడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాట్ల కోసం హోటల్ మారియెట్ చౌరస్తాను చిక్కడపల్లి ట్రాఫిక్ సీఐ వీరేశం, కవాడిగూడ డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఆకుల ప్రవీణ్ గురువారం పరిశీలించారు. కవాడిగూడ డివిజన్‌లోని మారియెట్ హోటల్ చౌరస్తాలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఆకుల ప్రవీణ్ ఇటీవల జీహెచ్ఎంసీ, నగర పోలీసు కమిషనర్లతో పాటు ట్రాఫిక్ పోలీసులకు వినతి పత్రం అందజేశారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ అధికారులు ఇటీవల తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. అదే విధంగా గురువారం మారియెట్ చౌరస్తాలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తే ఏమైనా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతాయా అనే అంశంపై చిక్కడపల్లి ట్రాఫిక్ సీఐ వీరేశం, జీహెచ్ఎంసీ అధికారి సన్నీ, పోలీసు సిబ్బంది ఆకుల ప్రవీణ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ వీరేశం మాట్లాడుతూ, తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలించామని. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తాము నివేదిస్తామని తెలిపారు. ఆకుల ప్రవీణ్ మాట్లాడుతూ, హోటల్ మారియెట్ చౌరస్తాలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుచేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని, జీహెచ్ఎంసీ, ట్రాఫిక్, పోలీసు అధికారులు అనుమతులు ఇవ్వాలని ఆయన కోరారు.

## 'బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించాలి'

కవాడిగూడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో వెనకబడి ఉన్న బీసీ వర్గాలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించి అమలు చేయాలని ధర్మసమాజ్ పార్టీ కవాడిగూడ డివిజన్ ఇన్‌చార్జి గుడపర్తి సంతోష్ మహరాజ్ డిమాండ్ చేశారు. గురువారం లోయర్ ట్యాంక్ బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, డెడికేషన్ కమిషన్ పేరుతో కాలయాపన చేయకుండా వెంటనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

## దాడి కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష

బర్కత్‌పుర, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాయితో ఓ వ్యక్తిపై దాడి చేసిన నిందితుడికి కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 2 వేల జరిమానా విధించింది. కాచిగూడ పీఎస్ సీఐ చంద్రకుమార్, అడ్మిన్ ఎస్ఐ డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. 2017 గోల్నాక కూరగాయల మార్కెట్‌కు సూర్యాపేట జిల్లా ఈటూరు గ్రామానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి నరేష్ (26) వచ్చాడు. తులసీరామ్‌నగర్‌కు చెందిన కూరగాయల వ్యాపారి పంతకి నర్సింహులు అలియాస్ నర్సింహ (44) ఓ మహిళ విషయమై అతడితో గొడవపడి బండరాయితో దాడి చేశాడు. దాడిలో నరేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి సోదరుడు రామకృష్ణ కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. కాగా, గురువారం ఈ కేసు నాంపల్లి క్రిమినల్ కోర్టులో తుది విచారణకు వచ్చింది. నాల్గవ అడిషనల్ సెషన్స్ జడ్జి సీవీఎస్ సాయిభూపతి .. నిందితుడు నర్సింహకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 2 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.